క్లుప్తంగా

ఘనంగా త్రయంబకేశ్వర స్వామి కల్యాణం



రమణయ్యపేట శివాలయంలో స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శివాలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పార్వతీ సమేత త్రయంబకేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు చైతన్య బృందం వేద మంత్రాలు నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కులమతాలకు అతీతంగా ఐక్యతతో మెలగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంతో మెలగాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మానవ ఐక్యమత్య దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మన అందరి మధ్య ఐక్యమత్యం అవసరమన్నారు. కార్యక్రమంలో డాక్టరు సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని మూడో బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండెంట్ ఎం.నాగేంద్రరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్‌ను పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్ బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ కమాండెంట్ మన్మధరావు, రవిశంకర్, ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ విలియం బెనర్జీ, స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ

బోట్‌క్లబ్: జ్యోతిష్య శాస్త్రంలోని వివిధ అంశాలపై ప్రముఖ పండితులు, పంచాంగ కర్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రచించిన పరిశోధన గ్రంథం జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు స్థానిక చల్లా ఫంక్షన్‌హాల్ జరగనుంది. సంస్కృత భాషలో రుషులు చెప్పిన అనేక యోగ విశేషాలు సోదాహరణంగా తేట తెలుగులో ఈ గ్రంథం వివరించినట్టు సరిపెల్ల శుక్రవారం తెలిపారు.

ఉఛీతం.. నెరవేరదే..!

- ఎన్నికల హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఉగాది నుంచే ఆర్టీసీలో మహిళల ప్రయాణమంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు
- బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించని వైనం



కాకినాడ సిటీ: సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలయ్యే దాఖలాలు కనిపించడం లేదు. మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చంటూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని నమ్మిన మహిళలందరూ ఓట్లు వేసి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. గద్దెనెక్కి ప్రభుత్వం 10 నెలలు గడచినా ఇచ్చిన హామీని అమలు చేయలేదు. ఉచిత ప్రయాణం ఎప్పుడు అని కూటమి నేతలను నిలదీసిన ప్రతిసారీ ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు.

పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో అక్కడి ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఆ ఊసే లేకుండా ఉంది. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉగాది నుంచేనంటూ...

ఉచిత బస్ ప్రయాణంపై మొదటిసారిగా ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. అటు తర్వాత దీపావళి కానుకగా ఉచిత ప్రయాణమంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు, అచ్చెన్నాయుడు, రవాణాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలంతా ఉగాది పండగ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణమంటూ చెప్పడం ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు దీని ఊసెత్తలేదు. దీనికి తోడు సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదిక సాక్షిగా సూపర్‌సిక్స్ పథకాలు చూస్తుంటే భయమేస్తోందని చెప్పడంతో పాటు, ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సైతం ఉచిత బస్ ప్రయాణం కోసం నిధులు కేటాయించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీంతో మహిళలంతా కూటమి నేతలపై గుర్రుగా ఉన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని మహిళలంతా కోరుతున్నారు.

మహిళలను మోసగించేందుకే..

అధికారమే పరమావధిగా భావించిన కూటమి నేతలు అడ్డగోలు హామీలు గుప్పించారు. తీరా అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించారు. పైగా హామీలను చూస్తుంటే భయమేస్తోందని సాక్షాత్తు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం సిగ్గు చేటు. హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమో? కాదో? గమనించలేరా. ఉచిత బస్ ప్రయాణం హామీ కేవలం మహిళలను మోసగించేందుకే చెప్పారు.

– జమ్మలమడక నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు, గైగోలుపాడు, కాకినాడ రూరల్

ఉగాది వెళ్లి చాన్నాళ్లయింది

ఉగాది నుంచే ఉచిత ప్రయాణమంటూ కూటమి నేతలంతా ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్ ప్రయాణం హామీ ఇప్పటి వరకూ అమలు చేయకపోవడం దారుణం. ఉగాది పండగ అయిపోయినా సరే ఉచిత బస్ ప్రయాణంపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం శోచనీయం. ప్రజలను ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తోంది.

– రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకురాలు, కాకినాడ

అధికారం కోసం నాటకం

అధికారం కోసం ఉచిత బస్ ప్రయాణమంటూ కూటమి నేతలు మహిళలను వంచించారు. అధికారం కోసం నాటకమాడారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఉచిత ప్రయాణంపై ఇప్పటికే ఎన్నోసార్లు కూటమి నేతలు ప్రకటిస్తున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడంలేదు. ఉచిత బస్ ప్రయాణం హామీని నమ్మి ఓట్లు వేసిన మహిళలకు నమ్మకద్రోహం చేయడం తగదు. ఇప్పటికైనా ఉచిత ప్రయాణంపై కూటమి నేతలు స్పష్టమైన ప్రకటన చేయాలి.

– కర్రి మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, తూరంగి, కాకినాడ రూరల్

పన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోండి

బోట్‌క్లబ్: ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీపై 50 శాతం రాయితీ, 2025– 26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్ను ఒకే సారి చెల్లిస్తే 5 శాతం రిబేటును నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భావన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకూ మాత్రమే తగ్గింపు ఉంటుందన్నారు. పన్ను చెల్లింపుల కోసం నగరంలో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక సినిమా రోడ్డులోని పాత మున్సిపల్ కార్యాలయం, శారద దేవి గుడి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం, వైద్య నగర్, రాజారామ్మోహన్‌నగర్, సీతారామ్‌నగర్, పావురాల తూము, యానాం రోడ్డు, తూరంగి పేట, న్యూ మున్సిప్ జంక్షన్, తిలక్ స్ట్రీట్, రామారావుపేట, మోహర్‌నగర్, నరసన్ననగర్, జట్ల పెదకాపు స్ట్రీట్‌లోని సచివాలయాల్లో పన్నులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

యువకుడిపై కత్తితో దాడి

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్.అచ్యుతాపురం చిన్న అంబేడ్కర్ వీధిలో స్థల వివాదం నేపథ్యంలో ఇంట్లో నిద్రిస్తున్న యువకుడు కుక్కల నానిపై పక్కనే నివాసం ఉంటున్న పేంటి జాజి శుక్రవారం కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసులు వివరాల ప్రకారం.. స్థలం నిమిత్తం ఇరు కుటుంబాలు మధ్య కొంత కాలంగా ఘర్షణ జరుగుతుండడంతో ఇంట్లో నిద్రిస్తున్న నానిపై జాజి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన నానిని కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిపై చర్యలు తీసుకుంటామని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు.

జీజీహెచ్ అత్యవసర విభాగం ఆకస్మిక తనిఖీ



వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లోని అత్యవసర విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ గురువారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. పలు మంచాలపై ఇద్దరు రోగులు ఉండడం చూసి వైద్యులు, నర్సులకు సూచనలిచ్చారు. ఇకపై క్యాజువాలిటీలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులను ఉంచొద్దని, తొలి దశ చికిత్స అందించి తక్షణమే వార్డుకు పంపాలని అన్నారు. ఈ ఆదేశాలు అమలయ్యేలా సీఎంవో పర్యవేక్షించాలన్నారు. అనంతరం పలువురి రోగుల విజ్ఞాపన మేరకు అత్యవసర విభాగంలో ఉన్న వార్డుల్లో సదుపాయాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు.

ఉగ్రదాడిలో మృతులకు సంతాపం



సంతాపం తెలియజేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

కాకినాడ రూరల్: కాశ్మీర్ లోయ పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతులకు నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరు విద్యార్థులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు. అచ్చంపేట జంక్షన్ వద్ద పీజీ సెంటరులో శుక్రవారం ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు మృతులకు ఆత్మశాంతి కలగాలని మౌనం పాటించారు. అన్ని తరగతి గదుల్లో విద్యార్థులు నిలబడి మృతులకు నివాళులర్పించారు. పర్యాటకులపై ఉగ్రవాదుల చర్య మానవత్వాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు.

7 నుంచి ఉచిత సమ్మర్ క్యాంపు

పెద్దాపురం: స్థానిక చిల్డ్రన్ క్లబ్(పీసీసీ) ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ తెలిపారు. సమ్మర్ క్యాంపునకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పీసీసీ ఆధ్వర్యంలో వరుసగా నాలుగో సంవత్సరం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు కరాటే, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. సమ్మర్ క్యాంప్‌కు వచ్చే వారు మే 5వ తేదీలోగా తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు. 94417 0187, 79016 97939 నంబర్లకు ఫోన్ చేసి రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమత్ర, మణికంత, యోగేష్, నాని, బాల మురళీకృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దోమకాటుతో మలేరియా జ్వరాలు



రమణయ్యపేటలో జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

కాకినాడ రూరల్: దోమకాటుతో మలేరియా జ్వరాలు వస్తాయని, సీజనల్‌గా వచ్చే వీటిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు సత్యనారాయణ మాట్లాడుతూ ఆడ అనాపిలిస్ దోమ కుట్టడం వలన మలేరియా జ్వరం వస్తుందని, దోమ కుట్టిన పది రోజుల్లో లక్షణాలు బయట పడతాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, త్రిమూర్తులు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి

బోట్‌క్లబ్: మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సత్య దంత వైద్యశాలలో ఆసుపత్రి సిబ్బందికి మలేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వైద్య విధానంపై అవగాహన కల్పించారు. జ్వరం, చలి, తలనొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇంటి వద్ద నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లీ, యేరూష, చైతన్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు



ఎన్‌సీసీ శిక్షణా సదస్సులో పాల్గొన్న గైనకాలజిస్ట్ విజయలక్ష్మి తదితరులు

పెద్దాపురం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు దేశభక్తితో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతుందన్నారు. ప్రముఖ గైనగాలజిస్ట్ ఎ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం పీటీ, యోగసనాలు, హెచ్‌పీవీ వ్యాక్సిన్, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహ్మద్ ఆఫీస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఐక్యమత్యంతో పాటు స్పోర్ట్ స్పిరిట్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహ్మద్ ఆఫీజ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే ఈ శిబిరం లక్ష్యమన్నారు. ప్రతీ శిక్షణాంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, ముఖ్యంగా వెపన్ పట్టుకున్నప్పుడు, ఫైర్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో ఫైరింగ్, వెపన్ ట్రైనింగ్, బాటిల్ ఫీల్డ్ అండ్ ఫీల్డ్ క్రాఫ్ట్, టెన్త్ పిచ్చింగ్, హెల్త్ అండ్ హైజీన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, లెఫ్టినెంట్ సత్యనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీఎల్ సమ్మర్ క్యాంపు పరిశీలన



విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులను సత్కరిస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గండేపల్లి, ఉండూరు మల్లాం, కిర్లంపూడి, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) సమ్మర్ శిక్షణను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు టి.సుదర్శన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఫొటో టెక్నిక్స్, డిజైనింగ్ పెయింటింగ్‌లతో పాటు వివిధ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, క్యాంపు కోర్సు కోఆర్డినేటర్ యు.మీనామాధురి, ఏటీఎల్ నోడల్ ఇన్‌చార్జి కల్యాణ్‌చక్రవర్తి, ఎంఈఓ–2 పి.పుల్లయ్య, ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జి టి.మహాలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీల కులను ఎంఈఓలు సత్కరించారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉత్తమ విద్యార్థులకు సత్కారం

సామర్లకోట: ఇటీవల విడుదల అయిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం సాయంత్రం పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. పాఠశాలలో 95 మంది పరీక్ష రాయగా 77 మంది పాస్ కావడంతో పాటు 16 మంది 500 మార్కులు మించి సాధించారని హెచ్‌ఎం తెలిపారు. ఫస్టు క్లాసు 51 మందికి, సెకండ్ క్లాసు 14 మందికి రాగా 12 మంది థర్డు క్లాసులో పాసయ్యారని హెచ్‌ఎం వివరించారు. 585 మార్కుల నుంచి 508 మార్కుల వరకు వచ్చిన విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమల బాబు, వార్డు కౌన్సిలర్ బలుసు వాసు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం చేశారు.

వేగిపోతున్నారు..!

- వేసవి తాపంతో విజృంభిస్తున్న వ్యాధులు
- పనులకు దూరమవుతున్న కూలీలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

పిఠాపురం: ఎండలు మండుతున్నాయి రోహిణీ కార్తె ఇంకా రాకుండానే ఎండల తీవ్రత పెరగడంతో ఇక వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. రోడ్లన్ని నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వాహనదారులు అపసోపాలకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో మరో పక్క సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డీహైడ్రేషన్‌కు గురై..

కొన్ని రోజులుగా ప్రచండ భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా వేసవి తాపంతో జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపాలు లేకుండా చూస్తున్నప్పటికీ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ఎండ వేడికి శరీరంలో నీటి నిల్వలు తగ్గి మనిషులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. దీంతో పలువురు వ్యాధుల బారిన పడుతుండడంతో పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పలు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ఎక్కువగా వడదెబ్బ, జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులతోనే మంచాన పడుతున్నారు. పలువురు వ్యవసాయ కూలీలు సైతం వేసవి తాపానికి గురై నీరసించి ఆస్పత్రుల పాలవుతున్నారు.



చెట్టు నీడకు చేరిన ఉపాధి కూలీలు

అందువల్ల జాగ్రత్తలు తీసుకోవాలి లేకపోతే ప్రమాదాలు సైతం సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేసవి ప్రతాపానికి గురి కాకుండా పలుచని ఖద్దరు దుస్తులు మాత్రమే ధరించాలన్నారు.

వడదెబ్బకు గురైతే ఇలా చేయండి

ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి ఉప్పునీటి ద్రావణం తాగించాలన్నారు. అనంతరం వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో వివిధ రకాల లవణాలు తగ్గిపోయి నీరసం రావడంతో పాటు వివిధ రోగాలకు గురవుతారన్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. అధికంగా నీటిని తాగుతూ కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

పనులకు దూరమవుతున్న కూలీలు

ఎండ ప్రతాపంతో కూలీలు పనులకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే వేసవి ప్రతాపం పెరిగిపోతుండడంతో ఎండకు తట్టుకోలేక జీవనోపాధిని సైతం వదులుకుంటున్నారు. చేలల్లో పనులకు వెళితే నీడనేదిలేక వడదెబ్బకు గురై ఆస్పత్రి పాలుకావాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ వ్యవసాయ పనులను ఎక్కువగా యంత్రాలతోనే చేయిస్తున్నారు.

కొబ్బరి బొండాలు, తాటి ముంజులకు గిరాకీ

వేసవి తాపం నుంచి తక్షణం ఉపశమనం కలిగించే కొబ్బరి బొండాలకు, తాటి ముంజలకు గిరాకీ పెరిగింది. ఎక్కడ చూసినా కొబ్బరి బొండాలు, తాటి ముంజుల అమ్మకాలు జోరందుకున్నాయి. కూల్ డ్రింక్‌ల కంటే సహజ సిద్ధంగా పోషకాలు లభించే వీటిని తాగేందుకు తినేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు.



వేసవి ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన గొల్లప్రోలు ప్రధాన రహదారి